సాక్షి
కుమురం భీం

బుధవారం । 26 । జూన్ । 2024



అడవిలో 'ఉపాధి'
అటవీ అభివృద్ధిలో భాగంగా ఉపాధిహామీ పథకం కింద పనులు చేపడుతున్నారు. గిరిజనులు, గిరిజనేతరులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. 8లో▸



సిరులు కురిపిస్తున్న చెత్త
ఇంటింటా సేకరించిన చెత్త ద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారు. ప్యాకెట్ల లో నింపి పంట సిరి పేరిట రైతులకు విక్రయిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.5 /27.6

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

29న జెడ్పీ ప్రత్యేక సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు జెడ్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, దుర్వినియోగం, వాడకంతో కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించే ర్యాలీలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో నకిలీ విత్తనాలు, పీడీఎస్ బియ్యం, గంజాయి, గుట్కా విక్రయాలతోపాటు మట్కా, గ్యాంబ్లింగ్, అక్రమ ఇసుక, నిషేధిత పదార్థాల రవాణా వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎవరైనా నిషేధిత విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం ఉంటే 87126 70505 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

'రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్‌: అసైన్డ్ పట్టా ఉన్న రైతులను అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామ శివారులోని సర్వే నం.165లో కొన్నేళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నం.165లో దాదాపు 75 మంది రైతులకు 20 సంవత్సరాల క్రితమే ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు ఫారెస్టు అధికారులు ఆ భూముల్లో ప్లాంటేషన్ వేస్తామని చెప్పడం దారుణమన్నారు. వెంటనే ఇటువంటి చర్యలను విరమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సేవలు



ఖనర్గాం బస్సు ప్రారంభిస్తున్న డీఎం

ఆసిఫాబాద్/వాంకిడి: ప్రజావసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సేవలు మెరుగుపరుస్తామని డీఎం విశ్వనాథ్ అన్నారు. జిల్లా కేంద్రం నుంచి వాంకిడి మండలం ఖనర్గాం వరకు మంగళవారం ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీని ఆదరిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని రూట్లకు కూడా బస్సులు నడుపుతామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వారి సమయానుకూలంగా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ప్రయాణికులతో కలిసి నందుప వరకు బస్సులో ప్రయాణించారు.

ప్రసవ వేదన!



- జిల్లాలో పెరుగుతున్న మాతాశిశు మరణాలు
- పౌష్టికాహార లోపంతో గర్భిణుల్లో రక్తహీనత
- అందని ద్రాక్షగా మెరుగైన వైద్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- సరైన రోడ్డు వ్యవస్థ లేకపోవడం కూడా ఓ కారణమే..

చింతలమానెపల్లి(సిర్పూర్): జిల్లాలో ప్రసూతి మరణాలు పెరుగుతున్నాయి. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఇటీవల విడుదల చేసిన నివేదికలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని మరో ఐదు జిల్లాల్లో పరిస్థితి గతేడాది కంటే ప్రసూతి మరణాలు పెరిగినట్లు వెల్లడైంది. జిల్లాలో పౌష్టికాహార లోపం, గర్భిణుల్లో రక్తహీనత, మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో జిల్లాలో మాతాశిశు మరణాలు నమోదవుతున్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు.

ఆస్పత్రుల్లో ఖాళీగా పోస్టులు

జిల్లాలో 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో జిల్లా ఆస్పత్రి, కాగజ్‌నగర్, సిర్పూర్ (టి)లో సామాజిక ఆస్పత్రులు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో గైనకాలజిస్టులను నియమించారు. సోమవారం ఇక్కడ మూడేళ్ల తర్వాత ఓ గర్భిణికి సిజేరియన్ ద్వారా ప్రసవం చేశారు. ఇక పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యుల చొప్పున విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ బెజ్జూర్, కౌటాల, రవీంద్రనగర్, పెంచికల్‌పేట్, దహెగాం సహా మరి కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యులను సర్దుబాటు చేస్తూ తాత్కాలికంగా ఇన్‌చార్జీలతో నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరు రెండుచోట్ల పని చేస్తున్నారు. అలాగే ఏఎన్‌ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించే స్టాఫ్‌నర్స్‌ల పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి.

వైద్యం కోసం పరుగులు పెట్టాల్సిందే..

అత్యవసర వైద్యం కోసం ప్రజలు జిల్లా కేంద్రం లేదా కాగజ్‌నగర్, సిర్పూర్(టి)కు రావాల్సి ఉంటుంది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ అరకొర వైద్యమే అందుతోంది. అర్హత లేని వారు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ వైద్యం అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితిగా పరిగణించే ప్రసవాలు, సర్జరీలు తదితర వైద్యసేవలు అందే పరిస్థితి జిల్లాలో లేదు. గర్భిణులు మెరుగైన ప్రభుత్వ వైద్యం మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు అదిలాబాద్ రిమ్స్‌పై ఆధారపడుతున్నారు. మరోవైపు చింతలమానెపల్లి మండలంలోని గూడెం, కోయపెల్లి, బూరుగూడ, బెజ్జూర్ మండలం సోమిని తలాయి, పెంచికల్‌పేట్ మండలంలోని మురళిగూడ, కమ్మర్‌గాం లాంటి గ్రామాలు జిల్లా కేంద్రం నుంచి సగటున 80 నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇక్కడి ప్రజలు వైద్యం కోసం ఆర్యోగ కేంద్రాలకు చేరుకోవడం గగనమే.. గూడెం నుంచి చింతలమానెపల్లికి కౌటాలకు చేరుకోవడానికి 30 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. ఈ కారణంగా గతంలో గర్భిణులు అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

ఆరేళ్లలో నమోదైన మాతాశిశు మరణాలు

సంవత్సరం	గర్భిణులు/ బాలింతలు	శిశువులు (14 ఏళ్లలోపు)
2018- 19	15	28
2019- 20	18	48
2020- 21	08	55
2021- 22	06	49
2022- 23	03	21
2023- 24	08	0

వేధిస్తున్న పౌష్టికాహార లోపం

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ మినహాయిస్తే అన్నీ గ్రామీణ మండలాలే.. ఇక్కడి ప్రజలో ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గతంలో నిర్వహించిన సర్వేలలో వెల్లడైంది. పౌష్టికాహారంపై అవగాహన కొరవడడం, ఆయా సీజన్లలో వ్యాధుల బారినపడడం రక్తహీనతకు ప్రధాన కారణం. ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాల ద్వారా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నా క్షేత్రస్థాయిలో లోపాలతో మెరుగైన ఫలితాలు రావడం లేదు. ప్రసవం జరిగే సమయంలో పౌష్టికాహార లోపంతో మరణాల సంఖ్య పెరుగుతోంది.

జిల్లాలో కొన్ని ఘటనలు

- 2023 జనవరి 8న చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన దిగిడె శోభ ప్రసవానంతరం మృతి చెందింది. గూడెం నుంచి ప్రసవం కోసం తీసుకువస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవమైంది. పుట్టిన శిశువు, తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు తల్లిని, కాగజ్‌నగర్‌కు శిశువును తరలించి చికిత్స అందించారు. గంట వ్యవధిలో తల్లీబిడ్డలు మృతి చెందారు. అంబులెన్స్‌లో గూడెం నుంచి కౌటాలకు తరలించడానికి సుమారు 3గంటలకు పైగా సమయం పట్టడమే ప్రధాన కారణం. చికిత్స ఆలస్యం కావడం, రక్తహీనత కారణంగా ఇద్దరు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.
- 2023 జనవరి 6న దహెగాం మండలం రాళ్లగూడకు చెందిన దోకె స్వరూప తొలి కాన్పులో నొప్పులు రాగా కాగజ్‌నగర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.
- 2023 జూన్ 2న పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లికి చెందిన గర్భిణి సామెర గీతకు సరైన చికిత్స అందకపోవడంతో తల్లీబిడ్డలు మృతి చెందారు. మొదటి కాన్పు కోసం తల్లిగారి ఊరు చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి వచ్చింది. నొప్పులు రావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించగా మృతి చెందింది.

ఎంపీల ప్రమాణ స్వీకారం



ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నగేశ్



ప్రమాణస్వీకారం చేస్తున్న వంశీకృష్ణ

ఆదిలాబాద్/చెన్నూర్: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ రాధామోహన్ సింగ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. గోడం నగేశ్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. గడ్డం వంశీకృష్ణ సింగరేణి పారిశ్రామిక ప్రాంత ప్రాముఖ్యతను తెలియజేస్తూ సింగరేణి కార్మికుడి డ్రెస్‌లో ప్రమాణ స్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్శించారు. ఇంగ్లిష్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. వంశీకృష్ణకు చెన్నూర్‌కు చెందిన మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీశ్, శ్రీనివాస్ ఢిల్లీలో శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగాలి



సిజేరియన్ చేయించుకున్న మహిళకు పండ్లు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. ఈ నెల 24న ప్రభుత్వాస్పత్రిలో సిజేరియన్ ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చిన ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన లొబాడే శోభకు పండ్లు అందించారు. శస్త్రచికిత్స చేసిన వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రిలో సురక్షిత కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లడం వల్ల ఆర్థికభారంతోపాటు ఆరోగ్యానికి భద్రత ఉండదన్నారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి వసతులపై సూపరింటెండెంట్ చెన్నకేశవులును అడిగి తెలుసుకున్నారు. రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, వ్యాధి పూర్తిగా నయమైన తర్వాతే వారిని ఆస్పత్రి నుంచి పంపించాలని సూచించారు. వర్షాకాలంలో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులతో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున బెడ్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో నిర్వహించిన సదరం క్యాంపును సందర్శించారు. ఆస్పత్రిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులతో చర్చించారు. డీఆర్డీవో సురేందర్, సహాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

దహెగాం/కాగజ్‌నగర్‌రూరల్: పెద్దపల్లి జిల్లాలో మానవ మృగం చేతిలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. చిన్నారి కుటుంబానికి కేవలం రూ.2.50 లక్షలు, ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కేటాయింపుతో సరిపెట్టడం సరికాదన్నారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కర్జి గ్రామానికి చెందిన రాకేశ్‌కు ఇటీవల విద్యుత్‌షాక్‌తో గాయాలు కాగా.. అతడిని పరామర్శించారు. అలాగే కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు షాకీర్, ఎల్కరి ప్రశాంత్, గౌతం తదితరులు ఉన్నారు.

ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించాలి



చింతలమానెపల్లి స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

చింతలమానెపల్లి/బెజ్జూర్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. కౌటాల సర్కిల్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ పోలీస్‌స్టేషన్లను మంగళవారం తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల పరిసరాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్‌వో, రెస్ట్‌రూం, లాకప్ రూంలను పరిశీలించారు. ప్రతిరోజూ ఎంత మంది బ్లూకోల్ట్, పెట్రోకార్స్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని ఆరా తీశారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ చోరీలు జరగకుండా చూడాలని ఆదేశించారు. డయల్ 100కు కాల్ వస్తే వెంటనే ఘటనా స్థలికి చేరుకోవాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలన్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, ఎస్సైలు దీకొండ రమేశ్, మధుకర్, నరేశ్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల ద్వారా సంరక్షణ చర్యలు

- రాష్ట్ర సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా సంక్షేమశాఖ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమశాఖ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఆరోగ్య స్థితిగతులు, ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తుందన్నారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు నిర్ధారణ ధ్రువపత్రాలు జారీ చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల దత్తత ప్రక్రియ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వృద్ధులపై పోషణపై వారి పిల్లలు నిర్లక్ష్యం చేస్తే ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరిట బదలాయింపు చేయడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన విద్యుత్, తాగునీటి సరఫరా, మూత్రశాలల నిర్మాణం తదితర మరమ్మతులు చేపడుతున్నామని వివరించారు.

'ప్రజాస్వామ్యానికి చీకటి రోజు'



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ డే జూన్ 25 చీకటి రోజని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1975-77 మధ్య కాలంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఏకపక్షంగా 21 నెలలపాటు దేశంలో అత్యవసర పరిస్థితి విధించారన్నారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విశాల్, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు శ్రావణ్, శ్రీను, రమేశ్, శ్రీదేవి, సమీర్ పాల్గొన్నారు.

కొబ్బరిసాగుతో రైతులకు మేలు



రైతులకు కొబ్బరిమొక్కలు అందిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): జిల్లాలోని నదీ తీర ప్రాంతాల్లో కొబ్బరి సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కొబ్బరి అభివృద్ధి సంస్థ(సీడీబీ) డిప్యూటీ డైరెక్టర్ కుమార్‌వేల్ అన్నారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి రైతువేదికలో మంగళవారం కొబ్బరి సాగు- ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఐటీడీఏ సహకారంతో మొదటిసారిగా కొబ్బరి సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగు చేసిన రైతులు ఫలితాలు సాధిస్తున్నారని, అలాగే కొబ్బరి సాగుతో బీళ్లు సాగు భూములుగా మారుతాయన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు ఉచితంగా ఐదు మొక్కలు అందించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్తలు డా.మురళి, డా.స్రవంతి, ఉట్నూర్ ప్రాజెక్టు ఉద్యానవన అధికారి సందీప్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజులనాయుడు, ఉద్యానవన అధికారులు శాంతిప్రియ, సుధీర్ కుమార్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్ దీపక్ తివారి, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లాలోని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామైక్య సంఘాల నిర్వాహకులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లతో మహిళా శక్తి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి లక్ష్యంతో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం 'మహిళా శక్తి' ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అందులో భాగంగానే పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే పని అప్పగించారని పేర్కొన్నారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్ కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల వంటి కార్యకలాపాలు చేపట్టేందుకు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని మహిళా సంఘాలు 78 మీసేవ కేంద్రాలు నెలకొల్పడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ఔత్సాహికులను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలని సూ చించారు. వ్యవసాయ యంత్రాలను అద్దెకివ్వడం ద్వారా మరింత ఆదాయం పొందవచ్చన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిట్లు నెలకొల్పడం లక్ష్యంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. మహిళలు బ్యాంకు రుణాలు, స్త్రీశక్తి రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు డీఆర్డీవో రామకృష్ణ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఆసిఫాబాద్: రైతు భరోసా పథకంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తుందని, ఎకరాకు ఏటా రూ.15 వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదిక నుంచి రైతు మిట్ట తిరుపతి మాట్లాడుతూ రైతులకు పదెకరాల వరకు రైతు భరోసా చెల్లించాలని కోరారు. ఏటా మే, నవంబర్‌లో పెట్టుబడి సాయం అందించాలన్నారు. వీసీలో డీఏవో శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు మిలింద్ కుమార్, బి.ప్రసాద్, ఏవోలు ఖాదర్ హుస్సేన్, తిరుమలేశ్వర్, ఏఈవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆంద్రా కాలనీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జన్నారం మండల చెరుకు గూడెం గ్రామానికి చెందిన గొల్లె రాజం (50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న మధ్యాహ్నం ఆంద్రాకాలనీ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న బైక్ రాజంను ఢీకొనడంతో కిందపడి తలకు తీవ్ర గాయమైంది. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. రాజంకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అంకుసాపూర్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, ఎలాంటి ఆధారాలు లభించలేదని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని మార్చురీకి తరలించామని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామం పోచంపాడు శివారులోని ఓ భూ వివాదంలో పరస్పర దాడిలో ఇరువర్గాలపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచంపాడు శివారులోని మూడు ఎకరాల భూమిలో నస్పూర్‌కు చెందిన బోరిగం వెంకటేశ్ విత్తనాలు నాటుతుండగా నస్పూర్‌కు చెందిన సామ్యూల్, అతడి సోదరుడు ప్రేమ్‌సాగర్ అడ్డుకున్నారు. ఆ భూమి తమదంటే తమదని వాగ్వాదానికి దిగి గొడవ పడ్డారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపైనొకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భీమన్నదేవుడికి జలాభిషేకం

భీమిని: వర్షాలు పడాలి.. పంటలు పండాలని మంగళవారం కన్నెపల్లి మండల కేంద్ర పరిధిలోని భీమన్న దేవుడికి మహిళలు జలాభిషేకం చేశారు. కన్నెపల్లికి చెందిన సుమారు 100 మంది మహిళలు కిలోమీటర్ మేర నడుచుకుంటూ బిందెలతో నీటిని తీసుకువచ్చి భీమన్న దేవుడి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు.

గుట్కా పట్టివేత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఫారెస్టు చెక్‌పోస్టు వెనుక గోదాంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.8 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి గుట్కాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుట్కా నిల్వలు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన అమీత్ బబన్‌వార్‌కు చెందినవిగా గుర్తించామని తెలిపారు. గుట్కా సంచులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై గంగన్న, కానిస్టేబుళ్లు సంజీవ్ పాల్గొన్నారు.

అడవిలో 'ఉపాధి'


అడవిలో ఉపాధి హామీ పథకం కింద కుంట నిర్మాణంలో కూలీలు

- డివిజన్‌కు రూ.8.62కోట్లు మంజూరు
- నాలుగు వేల మంది కూలీలకు పని
- అటవీ ఉత్పత్తులపై ఆధారపడొద్దని..

జన్నారం: అడవులపై ఆధారపడి, అటవీ సంపదతో జీవించే వారికి అటవీశాఖ ఉపాధి హామీ పథకంతో పని కల్పిస్తోంది. అటవీ సంపదతో అవసరం లేకుండా చేతినిండా పని లభిస్తోంది. దీంతో కూలీలు అటవీశాఖ అధికారులు చేపట్టే పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో టైగర్‌జోన్ నిబంధనల ప్రకారం అడవులకు వెళ్లే అవకాశం లేదు. ఏళ్లుగా అటవీ ఉత్పత్తులు, అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్న వారు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజనులు ఉపాధి కోసం వెదురు, బంక, తేనే, పండ్ల సేకరణ కోసం అడవులకు వెళ్లడాన్ని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. టైగర్‌జోన్ పేరుతో అడవులకు వెళ్లనీయకపోవడంతో తమకు బతుకు భారమవుతోందని పలువురు గిరిజనులు, గిరిజనేతరుల కోరిక మేరకు అటవీ శాఖ అధికారులు వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

సంవత్సరంలో రూ.8.62 కోట్లు మంజూరు

అటవీశాఖ అభివృద్ధిలో భాగంగా గడ్డి క్షేత్రాల పెంపకం, కందకాలు తవ్వకం, మొక్కలు నాటడం, కుంటల నిర్మాణం పనులు చేపట్టారు. వీటిని ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్నారు. ఈ పనులకు అటవీ ఆధారిత గ్రామాలకు చెందిన గిరిజనులు, గిరిజనేతరులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ప్రతీరోజు పని దొరకడంతో ఉత్సాహంగా పనులకు వెళ్తున్నారు. డివిజన్ పరిధిలోని 28 గ్రామాలకు చెందిన సుమారు 4000 మంది కూలీలు వంద రోజుల పని పూర్తి చేశారు. ఉపాధి హామీ పథకం కింద మొత్తం రూ.8,62,11,000 మంజూరు కాగా ఇందులో ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2024 వరకు రూ.6,65,08,000 ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. 155 పనులు అడవిలో చేపట్టి ఉపాధి హామీ కింద పూర్తి చేసినట్లు తెలిపారు.

కుంటల అభివృద్ధి

అటవీ ఆధారిత కుటుంబాలకు చేతినిండా పని లభిస్తే అటవీ ఉత్పత్తులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదనే ఉద్దేశంతో ఉపాధి హామీ పనులకు గత నాలుగేళ్లుగా శ్రీకారం చుట్టారు. అటవీ శాఖ ద్వారా ఉపాధి హామీతో అడవుల అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. నీరు వృథా పోకుండా కందకాల తవ్వకం, నీటి నిల్వ కోసం కుంటల నిర్మాణం, వన్యప్రాణులకు ఆహారంగా గడ్డి పెంపకాలు, చెక్‌డ్యాంల నిర్మాణం, ఆనకట్టలు తదితర పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడంతో కూలీలకు చేతినిండా పని లభిస్తున్నట్లు తెలిపారు. గతంతో పోలిస్తే రెండేళ్లుగా అడవిలోకి వెళ్లే జనాల సంఖ్య తగ్గుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

అడవులపై ఆధారపడకుండా



అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు చేతినిండా పని కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. గిరిజనులు అడవిపై ఆధారపడకుండా, అటవీ ఉత్పత్తులతో పని లేకుండా పని కల్పిస్తున్నాం. ఉపాధి హామీ పనుల ద్వారా గిరిజనులు అడవులపై ఆధారపడకుండా పని చేసుకుంటున్నారు. ఏడాదిలో రూ.6.65 కోట్లు కూలీలకు చెల్లింపులు చేశాం. అడవుల అభివృద్ధికి అందరూ సహకరించాలి.

– శివ్‌ఆశిష్ సింగ్, డీఎఫ్‌వో

బొగ్గుబావులు సింగరేణికే దక్కాలి

- లాభాల వాటాలో 35 శాతం చెల్లించాలి
- టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

మందమర్రిరూరల్: తెలంగాణలో నూతనంగా ఏర్పాటు చేసే బొగ్గు గనులు భేషరతుగా సింగరేణికే దక్కాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం పాట ద్వారా సింగరేణికి దక్కకుండా కుట్ర చేస్తోందని విమర్శించారు. వేలం పాటలో పాల్గొని బొగ్గు బావులు దక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం కపట నాటకాలు ఆడుతోందని, ఈ విషయాన్ని తెలంగాణ సమాజం, సింగరేణి ఉద్యోగులు క్షమించబోరని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థ వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించి 35శాతం వాటా వచ్చే నెల ఉద్యోగులకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు రాజశేఖర్, బడికెల సంపత్, సారంగపాణి, కొండల్‌రావ్, అందె శ్రీకాంత్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరుకావాలి


గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి, అధికారులు

శ్రీరాంపూర్: ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021నుంచి 2023వరకు సంవత్సరంలో ఒక్క మస్టర్ కూడా చేయని ఉద్యోగులు ఉన్నారని, ఇది క్రమశిక్షణ రాహిత్యమేనన్నారు. నిర్ణీత మస్టర్లు చేయకుంటే, కంపెనీ ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం ఉంటుందన్నారు. సక్రమంగా విధులకు హాజరై హాజరుశాతాన్ని ఇప్పటికైనా పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఏరియా ఎస్ఓటుజీఎం పురుషోత్తం రెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

చెన్నూర్: రైతుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నాడని చెన్నూర్ బీట్ ఆఫీసర్ రవికుమార్ పై ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వర్షాకాలంలో కావడంతో అటవీ ప్రాంతంలో ఎండిపోయిన వంట చెరుకు తీసుకొని వస్తే ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్‌కు చెందిన బొడమీద శ్రీనివాస్, పోచన్న, చెన్న నారాయణలకు చెందిన గొడ్డళ్లను గుంజుకొని, బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. నాకు రూ.2వేలు ఇస్తే కేసు ఉండదని, ఫారెస్ట్ ఆఫీస్‌కు వెళ్తే పెద్ద ఎత్తున ఫైన్ పడుతుందని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫారెస్ట్ ఉన్నతాధికారులు బీట్ ఆఫీసర్ వ్యవహారంపై విచారణ జరిపి, శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నా యకులు చింతల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'మమత' సహకార సంఘం ఎన్నికలు రద్దు


నామినేషన్ వేసేందుకు వచ్చిన వారిని బయటకు పంపిస్తున్న పోలీసులు

- నామినేషన్ల స్వీకరణ సమయంలో ఉత్తర్వులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల హైడ్రామా

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని మమత వినియోగదారుల సహకార సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ పాలకమండలి ఎన్నికలు రద్దయ్యాయి. ఈ నెల 19న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, ఎన్నికల అధికారిగా లక్సెట్టిపేట అసిస్టెంట్ రిజిస్ట్రార్ సందీప్‌కుమార్‌ను నియమించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న సంఘ కార్యాలయంలో ఈ నెల 24 నుంచి 26వరకు నామినేషన్లు స్వీకరించాల్సి ఉంది. నామినేషన్లు వేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు తొమ్మిది మంది రాగా ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ కార్యాలయంలో లేరు. సభ్యులు గంటన్నరసేపు ఎదురు చూశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వారంతా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కావడం, కాంగ్రెస్ పార్టీ వారు పెద్ద సంఖ్యలో రావడంతో అందరినీ పట్టణ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో బయటకు పంపించారు. గంటన్నర తర్వాత ఎన్నికల అధికారి వచ్చి ఎన్నికల నోటిఫికేషన్ రద్దయినట్లు ప్రకటించారు. మొదటి రోజు ఎవరూ నామినేషన్ వేయలేదని, ఎన్నిక రద్దు చేస్తున్నట్లు స్టేట్ కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ అడిషనల్ రిజిస్ట్రార్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రద్దు కాపీని తీసుకు వచ్చేందుకు వెళ్లానని తెలిపారు. కాగా, ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను రద్దు చేయించిందని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, మమత వినియోగదారుల సహకార సంఘ చైర్మన్ యెర్రం తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. నామినేషన్ వేసేందుకు రాగా ఎన్నికల అధికారి అందుబాటులో లేకపోవడం ఏంటని, అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్‌డీఎల్ యంత్రాలు ప్రారంభం


యంత్రాలను ప్రారంభిస్తున్న గని మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై రెండు ఎస్‌డీఎల్ యంత్రాలకు మంగళవారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత యంత్రాల స్థానంలో కొత్తగా వచ్చిన యంత్రాలు గని ఉత్పత్తి పెంచడానికి, ఆపరేటర్ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రారంభించినట్లు తెలిపారు. రక్షణతో కూడిన మంచి ఉత్పత్తి సాధించడంలో ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, కార్మికులు, సూపర్‌వైజర్లు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని ఇంజనీర్ కిషోర్‌కుమార్, సూపర్‌వైజర్ నాయిని శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, రవికిరణ్, సారంగపాణి, రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలి'


బూత్ అధ్యక్షులతో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

చెన్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చెన్నూర్‌లో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు అన్నారు. మంగళవారం చెన్నూర్ పట్టణంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఓట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి లీడ్ రావడం శుభపరిణామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఎంపీ ఎన్నికలలో లీడ్ వచ్చిన బూత్ అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, దుర్గం అశోక్, రజనీష్ జైన్, పట్టి వెంకటకృష్ణ, రాపర్తి వెంకన్న, కొండపాక చారి, వెంకటనర్సయ్య, కమ్మల శ్రీనివాస్, కేవీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 168మంది హాజరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో మంగళవారం పాలిసెట్–2024 కౌన్సెలింగ్ నిర్వహించారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కో విద్యార్థి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అధికారులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొత్తం 168 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు.

పద్మనగర్‌లో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పద్మనగర్ కాలనీకి చెందిన అడేటి సాయికిరణ్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారం, 40 తులాల వెండి ఎత్తుకెళ్లారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయికిరణ్ తన తల్లి లక్ష్మి ఆరోగ్య బాగాలేకపోవడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంచిర్యాల నుంచి రాత్రి ఇంటికి వచ్చి తాళం తీస్తే రాలేదు. వెనుకాలకు వెళ్లి చూడగా తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి బంగారం, వెండి నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ఆదివాసీల భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న పోచయ్య, నాయకులు, బాధితులు

బెల్లంపల్లి: ఆదివాసీల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న అగ్ర కులస్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి కొలవార్‌సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు చెందిన 6.31ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు అగ్రకులస్తులు దాడి చేసి ఆక్రమించుకున్నారని తెలిపారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఆదివాసీ మన్నేవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి భీమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపురి రఘు, నాయకులు గొలిసెట్టి వెంకటస్వామి, నాయిని పెద్దులు, కిష్టయ్య, పోశం, బాధితులు పాల్గొన్నారు.

సెల్లార్ ప్రహరీ కూలి నలుగురికి గాయాలు

- ముందస్తుగా హెచ్చరించిన మున్సిపల్ కమిషనర్
- నోటీసులు అందజేసినా బేఖాతర్ చేసిన ఇంటి యజమాని


స్వల్పంగా గాయపడిన రాములు


తీవ్రంగా గాయపడిన గంగరాజు


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా సమీపంలో మంగళవారం సెల్లార్ ప్రహరీ కూలి నలుగురు కూలీలు గాయపడ్డారు. ఇటీవల సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు మృతిచెందిన ఘటన మరవకముందే మరో ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వెన్నంపెల్లి లక్ష్మినారాయణ నూతన భవన నిర్మాణం చేపడుతున్నాడు. సెల్లార్ కోసం పక్కనే ఇటుకలతో పది రోజుల క్రితం ప్రహరీ నిర్మించారు. పక్కనే సిమెంట్ పిల్లర్ల మధ్యలో మట్టి పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఇటుకల ప్రహరీ కూలి కూలీలపై పడింది. దీంతో కాసిపేట మండలం ధర్మరావుపేటకు చెందిన అరికెల గంగారాజు తీవ్రంగా, శ్రీరాంపూర్‌కు చెందిన పశుల మల్లయ్య, సీతరామ్‌పల్లికి చెందిన ఐటిపాముల రాములు, సోమగూడంకు చెందిన నర్సయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక సీఐ బన్సీలాల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నోటీసులు ఇచ్చినా రక్షణ చర్యలు పాటించలేదు..

ఈ నెల 13న జిల్లా కేంద్రంలో సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన నేపథ్యంలో నూతనంగా భవన నిర్మాణాలు చేపడుతున్న ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. పనుల్లో, సెల్లార్ నిర్మాణంలో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో లక్ష్మినారాయణకు సైతం నోటీస్ అందజేశారు. అయినా నిబంధనలు బేఖాతర్ చేస్తూ కూలీలకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై కమిషనర్ ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మహారాష్ట్రకు తరలిస్తున్న ఎరువుల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..


పట్టుబడిన ఎరువుల వాహనం

చెన్నూర్: చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు ఎరువులు తరలిస్తున్నారని 'సాక్షి'లో 'సరిహద్దు దాటుతున్న ఎరువులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు ఎరువులు అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు జాతీయ రహదారి సమీపంలో తనిఖీలు చేయగా గోదావరిరోడ్డు సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద బొలేరో వాహనంలో 60బస్తాల కాంప్లెక్స్ ఎరువులను పట్టుకున్నట్లు వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఎరువుల విలువ రూ.72వేలు ఉంటుందని తెలిపారు. ఎరువుల బస్తాల వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు, ఎరువులను మహారాష్ట్రకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెస్క్యూ సిబ్బందికి సన్మానం


ప్రశంసాపత్రాలు పొందిన రెస్క్యూ సిబ్బందితో అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీల్లో క్లిష్ట పరిస్థితుల్లో సేవలు అందించిన రెస్క్యూ సిబ్బందిని ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్‌లోని ఇల్లందు క్లబ్‌లో ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లును ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, ఇతర అధికారులు శాలువాతో సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఎస్ఓటు జీఎం పురుషోత్తంరెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారులు ఎం.శ్రీనివాస్, టీ.శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు చిరంజీవి, అరవిందరావు పాల్గొన్నారు.